# సత్య వాక్కు

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**ఇంగ్లీషు — THE VOICE OF TRUTH**

సోమవారము
బుధవారము } 9-00 to 9-15 p. m.

**హింది — SATYA SUSAMACHAR**

మంగళవారము
గురువారము
శుక్రవారము } 9-00 to 9-15 p. m.

ఆదివారము — 1-30 to 1-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.

గురువారము
శుక్రవారము } 6-45 to 7-00 p. m.

**మలయాళం — THE VOICE OF TRUTH**

మంగళవారము
శుక్రవారము } 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి:

**SATYA VANI**
**P.O. Box. 80**
**KAKINADA - 533 001**

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

**Pleading for restoration of pure New Testament Christianity.**

ంచిక **9** ఏప్రిల్ **1983** సంపుటి **3**

## సంపాదకీయము

### క్రీస్తు పునరుత్థానము - సౌలు మార్పు

*( The Resurrection of Christ and the Conversion of Saul )*

క్రీస్తు సమాధినుండి లేచెనని ఒక అవిశ్వాసిని నమ్మించుటకు ల ఋజువులెన్నో యున్నవి. అట్టి బలమైన ఋజువులలో ఒకటి పొ.కా. 9వ అధ్యాయములో కనబడుచున్నది. అక్కడ తార్సువాడైన లు మార్పు జెందిన కథనము చెప్పబడింది. అయితే క్రీస్తు పునరుత్థ మునకు దీనికి గల సంబంధము ఏమి యున్నది? సౌలు ఎవరో అత ందుకు ఎట్లు మార్పు జెందాడో తెలిసికొంటే అంతా యున్నది.

సౌలు కిలికియలోని తార్సులో పుట్టిన యూదుడు. అతడా పట్ట ములో గమలీయేలు పాదముల యొద్ద పెరిగి ధర్మశాస్త్ర సంబంధ గు నిష్టయందు శిక్షితుడై దేవుని గూర్చి అత్యాసక్తిగలవాడై యుండెను (అపొ.కా. 22:3). అతడు ఎనిమిదవ దినమున సున్నతి ందెనని, ఇశ్రాయేలు వంశపువాడని, బెన్యామీను గోత్రములో

పుట్టి హెబ్రీయుల సంతానమైన హెబ్రీయుడని, ఒక పరిసయ్యుడని అతని గూర్చి మనం చదువగలము (ఫిలిప్పీ 3:5). స్వాతంత్ర్యుడుగా పుట్టినందున అతడు రోమీయుడు (అపొ.కా. 22:27, 28).

స్తెఫనును రాళ్ళు రువ్వి చంపిన సందర్భములో సౌలునుగూర్చి మొదట మనం చదువగలము (అపొ.కా. 7:58). సౌలు నేరుగా రాళ్ళు రువ్వకపోయినను అతడు స్తెఫను చావుకు సమ్మతించెనని మనకు చెప్పబడినది (అపొ.కా. 7:60). ఆకాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున క్రీస్తు శిష్యులు ఆయా ప్రాంతములకు చెదరిపోయిరి. "సౌలయితే ఇంటింట జొచ్చి పురుషులను స్త్రీలను ఈడ్చుకొనిపోయి చెరసాలలో వేయించి సంఘమును పాడుచేయుచుండెను" (అపొ.కా. 8:3).

అపొ.కా. 9వ అధ్యాయములో మనం ఇట్లు చదువగలము: "సౌలు ఇంకను ప్రభువుయొక్క శిష్యులను బెదరించుటయును హత్య చేయుటయును తనకు ప్రాణాధారమైనట్టు ప్రధాన యాజకుని యొద్దకు వెళ్ళి యీ మార్గమందున్న పురుషులనైనను స్త్రీలనైనను కనుగొనిన యెడల వారిని బంధించి యెరూషలేమునకు తీసుకొని వచ్చుటకు దమస్కులోని సమాజములవారికి పత్రికలిమ్మని అడిగెను. అతడు ప్రయాణము చేయుచు దమస్కు దగ్గరకు వచ్చినప్పుడు, అకస్మాత్తుగా ఆకాశమునుండి యొక వెలుగు అతని చుట్టు ప్రకాశించెను. అప్పుడతడు నేలమీద పడి - సౌలా, సౌలా నీవేల నన్ను హింసించుచున్నావని తనతో ఒక స్వరము పలుకుట వినెను. ప్రభువా, నీ వెవడవని అతడడుగగా ఆయన - నేను నీవు హింసించుచున్న యేసును; లేచి పట్టణములోనికి వెళ్ళుము, అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడునని చెప్పెను. అతనితో ప్రయాణము చేసిన మనుష్యులు ఆ స్వరము వినిరి గాని యెవనిని చూడక మౌనులై నిలువబడిరి. సౌలు నేలమీదనుండి లేచి కన్నులు తెరచినను ఏమియు చూడలేకపోయెను

గనుక వారతని చెయ్యి పట్టుకొని దమస్కులోనికి నడిపించిరి. అతడు మూడు దినములు చూపులేక అన్నపానము లేమియు పుచ్చుకొనక యుండెను.

దమస్కులో అననీయ అను ఒక శిష్యుడుండెను. ప్రభువు దర్శనమందు అననీయా, అని అతనిని పిలువగా; అతడు - ప్రభువా, యిదిగో నేనున్నాననెను. అందుకు ప్రభువు, నీవు లేచి తిన్ననిదనబడిన వీధికి వెళ్ళి, యూదా అనువాని యింట తార్సువాడైన సౌలు అను వాని కొరకు విచారించుము; ఇదిగో అతడు ప్రార్థన చేయుచున్నాడు. అతడు అననీయ అనునొక మనుష్యుడు లోపలికి వచ్చి తాను దృష్టి పొందునట్లు తలమీద చేతులుంచుట చూచియున్నాడని చెప్పెను. అందుకు అననీయ - ప్రభువా, యీ మనుష్యుడు యెరూషలేములో నీ పరిశుద్ధులకు ఎంతో కీడు చేసియున్నాడని అతనిగూర్చి అనేకులవలన వింటిని. ఇక్కడను నీ నామమును బట్టి ప్రార్థన చేయు వారినందరిని బంధించుటకు అతడు ప్రధాన యాజకులవలన అధికారము పొంది యున్నాడని ఉత్తరమిచ్చెను. అందుకు ప్రభువు - నీవు వెళ్ళుము. అన్యజనులయెదుటను రాజులయెదుటను ఇశ్రాయేలీయుల యెదుటను నా నామము ధరించుటకు ఇతడు నేను ఏర్పరచుకొనిన సాధనమై యున్నాడు. ఇతడు నా నామముకొరకు ఎన్ని శ్రమలను అనుభవింప వలెనో నేను ఇతనికి చూపుదునని అతనితో చెప్పెను. అననీయ వెళ్ళి ఆయింట ప్రవేశించి, అతనిమీద చేతులుంచి - సౌలా సహోదరుడా నీవు వచ్చిన మార్గములో నీకు కనబడిన ప్రభువైన యేసు, నీవు దృష్టి పొంది పరిశుద్ధాత్మతో నింపబడునట్లు నన్ను పంపియున్నాడని చెప్పెను. అప్పుడే అతని కన్నులనుండి పొరలవంటివి రాలగా దృష్టికలిగి, లేచి బాప్తిస్మము పొందెను; తరువాత ఆహారము పుచ్చుకొని బలపడెను.

పిమ్మట అతడు దమస్కులోనున్న శిష్యులతోకూడ కొన్ని దినములుండెను. వెంటనే సమాజ మందిరములలో యేసే దేవుని

కుమారుడని ఆయననుగూర్చి ప్రకటించుచు వచ్చెను. వినినవారందరు విభ్రాంతినొంది, యెరూషలేములో ఈ నామమును బట్టి ప్రార్థన చేయు వారిని నాశనము చేసినవాడితడే కాదా? వారిని బంధించి ప్రధాన యాజకుల యొద్దకు కొనిపోవుటకు ఇక్కడికికూడ వచ్చి యున్నాడని చెప్పుకొనిరి. అయితే సౌలు మరి యెక్కువగా బలపడి, ఈయనే క్రీస్తు అని రుజువుపరచుచు దమస్కులో కాపురమున్న యూదులను కలవరపరచెను" (అపొ. కా. 9:1-22).

తరువాత సౌలు పౌలుగా పిలువబడెనని మనం చదువగలము (అపొ. కా. 13:9). అప్పటినుండి అతడు అదే పేరుతో పిలువబడెను. అపొ.కా. 22 లోను, 26 లోను తాను మార్పు జెందిన కథనమును అతడు మరల తెలియజెప్పాడు. అపొ. కార్యముల గ్రంథములో అధిక భాగము అతడు చేసిన సువార్త యాత్రలను గూర్చి తెలియజేయుచున్నది. అతడొక ఖైదీగా యెరూషలేమునుండి కైసరయకు, ఇటలీకి, చివరిగా రోమాకు ఎట్లు కొనిపోబడెనో అది తెలియజేయుచున్నది. క్రొత్త నిబంధనలోని అనేక పత్రికలను అతడే వ్రాసాడు. అతని జీవితకాలంలో క్రీస్తుకొరకు అతడనేక హింసలను భరించాడు. అతడొక హతసాక్షిగా మరణించాడు. పూర్వము తాను ప్రభువు బిడ్డలను హింసించినందున తాను బ్రదికియున్న కాలమంతయు దుఃఖితుడై జీవించాడు. "నజరేయుడైన యేసు నామమునకు విరోధముగా అనేక కార్యములు చేయవలెనని నేననుకొంటిని" అని అతడొక సందర్భములో పలికాడు (అపొ.కా.26:9). "పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. అట్టివారిలో నేను ప్రధానుడను" అని మరొక సందర్భములో అతడు పలికాడు (I తిమో. 1:15).

దీని యంతటిలోను ఒక ప్రశ్న ఉద్భవించుచున్నది: సౌలు లేక పౌలు తన జీవితంలో అకస్మాత్తుగా అంతటి మార్పును ఎందుకు కను

బరచాడు ? మొదట అతడు క్రీస్తు అనుచరుల నందరినీ ఘోరముగా హింసించాడు. గాని క్రీస్తు అనుచరుడై తానే హింసింపబడ్డాడు. యేసు అనుచరుడగు స్తెఫను మరణానికి అతడంగీకరించాడు. గాని అతడు మార్పు నొందిన తరువాత యూదులే అతని చంప ప్రయత్నించారు. చివరిగా హతసాక్షివలె అతడు మరణించాడు. క్రీస్తు ఒక మోసగాడయితే ఏమానవుడైనా అంత మారిపోవునా ? ఆయన సమాధినుండి ఎన్నడు లేవనట్లయితే ఆయన అనుచరుడుగా అతడు మార్పు జెందునా? ఆయనకొరకు ప్రాణముల నర్పించునా ?

క్రీస్తునుగూర్చి సౌలు అంత త్వరితగతిని తన మనస్సు నెట్లు మార్పుకోగలిగాడో యని కొందరు ఆశ్చర్యపడ్డారు. అతడు మార్చుకొన్నాడు గనుకనే క్రీస్తు పునరుత్థానుడైన ప్రభువని మరింత రుజువగుచున్నది. యేసు సౌలుకు కనబడినప్పుడు, అది ఎంత బలంగా యుండెనంటే తాను దేవుని కుమారునితో ముఖాముఖిగా యున్నట్లు అతనికింకేమియు సంశయము లేకపోయెను. అతడు నిష్కపటుడు గనుక ఆయనే క్రీస్తని అంగీకరించెను. అందువలన నేనేమి చేయవలెనని మాత్రమే అతడు అడుగగలిగెను. అతడాయనకు విధేయుడైన తరువాత, క్రీస్తే పునరుత్థానుడైన ప్రభువని వెంటనే బోధింప నారంభించెను. అంతమాత్రమే కాదుగాని దానివలననే తన జీవితాన్ని క్రీస్తుకు అప్పగించుటకు ఇష్టపడెను. మానవులు ఈలోకంలోను రాబోవు లోకంలోను కూడ రక్షింపబడు నిమిత్తము మరణించి సమాధినుండి తిరిగి లేచిన ఆయన కొరకు అతడు సంతోషముతో హింసలు భరించుటకును చివరకు మరణించుటకును సంసిద్ధుడాయెను.

గనుక క్రీస్తు సమాధినుండి తప్పక లేచెను. సౌలుయొక్క మార్పు అతని జీవితం కూడా, దాన్ని గూర్చిన బలమైన రుజువులు. క్రీస్తు సమాధినుండి లేచాడనుట తప్ప సౌలు జీవితంలో కలిగిన గొప్ప మార్పుకు సంతృప్తికరమైన జవాబును మనం ఈయలేము. ఈవాదనను

క్రీస్తు శత్రువులందరు ఏకమైనను నిరాకరించలేరు. ఇందువలనను మరింకను అనేకమైన కారణములవలనను క్రీస్తు నిజముగా సమాధినుండి తిరిగి లేచాడనియు, నేటివరకు ఆయన ప్రభువులకు ప్రభువుగాను, రాజులకు రాజుగాను సజీవుడై యున్నాడనియు మనము ముగింపుకు రావలసియున్నది. నీవాయనయందు విశ్వాస ముంచుచున్నావా? అట్లయితే నీవాయనకు లోబడి ఆయన బిడ్డ కాగలవా? నీవట్లగుదువని మా ప్రార్థన.

---

## క్రీస్తు పునరుత్థానము

### *( The Resurrection of Christ )*

క్రైస్తవుని యొక్క విశ్వాసమంతయు, క్రైస్తవ్యమంతయు యేసుక్రీస్తు యొక్క పునరుత్థానముపై ఆధారపడి యున్నది. యేసుక్రీస్తు సిలువపై మరణించి, సమాధి చేయబడిన తరువాత మూడవ దినమున తనకు తానే ప్రాణమును పోసుకొని, సజీవుడై అద్భుతరీతిగ తిరిగి లేచెనను సంగతియే పునరుత్థానము. మొదటి శతాబ్దములో క్రీస్తుయొక్క అపొస్తలుల బోధలో పునరుత్థానము బహు ప్రాముఖ్యాంశమై యుండెను. నాటినుండి నేటివరకు జీవించుచున్న ప్రతి క్రైస్తవుడు పునరుత్థానము ప్రశ్నింపతగని ఒక గొప్ప వాస్తవమని అంగీకరించి విశ్వసించును. అయితే కొందరు యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును శంకింతురు. అట్టివారి నుద్దేశిస్తూ అపొ. పౌలు 1 కొరింథీ 15:12-19 లో ఇట్లు వ్రాసాడు :

“క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడని ప్రకటింపబడుచుండగా మీలో కొందరు — మృతుల పునరుత్థానము లేదని యెట్లు చెప్పుచున్నారు? మృతుల పునరుత్థానము లేనియెడల, క్రీస్తుకూడ లేపబడి యుండలేదు. మరియు క్రీస్తు లేపబడి యుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే. దేవుడు క్రీస్తును లేపెనని, ఆయనను గూర్చి

మేము సాక్ష్యము చెప్పి యున్నాముగదా? మృతులు లేపబడనియెడల దేవుడాయనను లేపలేదు గనుక మేమును దేవుని విషయమై అబద్ధపు సాక్షులముగా అగపడుచున్నాము. మృతులు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములలోనే యున్నారు. అంతేకాదు, క్రీస్తునందు నిద్రించినవారును నశించిరి. ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరికంటె దౌర్భాగ్యులమై యుందుము".

## క్రీస్తు లేపబడకపోతే....?

మనము చదివిన ఈ వాక్యభాగములో క్రీస్తుయొక్క పునరుత్థాన సమస్యను అపో. పౌలు కొన్ని ముఖ్యాంశములుగ విభజించి నిరూపించాడు. యేసును సమాధినుండి దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులమని (అపో. కా. 2:32) అపొస్తలులందరు దృఢముగ బోధించిరి. అందువలన క్రీస్తు మృతులలో నుండి లేపబడకపోతే అపొస్తలులందరు అబద్ధ సాక్షులవలె అగపడుదురు. మనము నీతిమంతులముగా తీర్చబడుటకై క్రీస్తు లేపబడెను (రోమా 4:25) అని వారు బోధించుటచే, ఆయన పునరుత్థానుడు కాని యెడల మన పాపములనుండి మనకు రక్షణలేదు. అందుచే మన పాపములలో నశించిన వారమగుదుము. క్రీస్తు పునరుత్థానమే మన పునరుత్థాన వాగ్దానమని క్రైస్తవులు విశ్వసించుచున్నందున (1 కొరింథీ 15:20), క్రీస్తు మృతులలో నుండి లేపబడకపోతే వారు సమాధి యనంతరము నిరీక్షణ లేనివారిగను, మనుష్యులందరికంటె దౌర్భాగ్యులుగను అగపడుదురని పౌలు తర్కించాడు.

"యేసుక్రీస్తు మృతులలోనుండి పునరుత్థానుడై నందున దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపించబడెను" అని రోమా 1:4 లో పౌలు వ్రాసాడు. అందువలన క్రీస్తుయొక్క దైవత్వము ఆయన పునరుత్థానముపై ఆధారపడి యున్నట్లు మనము గ్రహించగలుగుచున్నాము. యేసుక్రీస్తు ఈ లోకములో జీవించుచుండగా అనేక అద్భుతములను,

మహాత్కార్యములను, సూచక క్రియలను చేసాడు. అయితే ఆయన మృతులలోనుండి లేచుట 'అద్భుతములకు అద్భుతమై యున్నది'. పునరుత్థానము యథార్థమని నిరూపింపబడగల్గిన యెడల క్రీస్తు చేసిన అద్భుతములన్నియును యథార్థములని మనము ఇట్టే అంగీకరింపవచ్చును. ఆ యద్భుతములే ఆయన దైవత్వమును కూడ నిరూపించుచున్నవి (యోహా॰ 20:30, 31). గనుక క్రీస్తుయొక్క పునరుత్థానమును మనము పరిశోధించుట ఎంతయో ఉత్తమమైనది.

## చరిత్రాత్మక వాస్తవములు

క్రీస్తు పునరుత్థానమును పరిశోధించునపుడు కొన్ని చరిత్రాత్మక వాస్తవములను మనము సేకరించవలసియున్నది. క్రీస్తు చనిపోయి తిరిగి లేచెను అనునది ఒక గొప్ప చారిత్రాత్మక వాస్తవమై యున్నది. దానికున్న చారిత్రాత్మక ఋజువులు అనేకములు. క్రీస్తుయొక్క పునరుత్థానమును గూర్చి క్రైస్తవులు, క్రైస్తవేతరులు, ఆస్తికులు (Theists), నాస్తికులు (Atheists) నేను చెప్పబోయే ఈ క్రింది విషయములలో ఏకీభావము కలిగియున్నారు: 1. నజరేయుడైన యేసు అను వ్యక్తి చరిత్రలో ఒకానొక కాలమున జీవించెననియు, క్రొత్తనిబంధన ఆ వ్యక్తినిగూర్చి చెప్పు కాలములోనే ఆయన నివసించెననియు వారంగీకరింతురు. 2. ఆయన అతి త్వరలో పేరుప్రఖ్యాతులు గడించెననియు, ముఖ్యముగా సామాన్య ప్రజలలో ఆయన పలుకుబడి బహు ఘనమైనదనియు వారంగీకరింతురు. 3. పొంతి పిలాతు రోమాదేశపు అధిపతిగా యుండగా ఈ నజరేయుడైన యేసు యూదులచే సిలువపై చంపబడెననియు, ఆయన శరీరము అరిమతయి యోసేపు అను ఒక ధనవంతుని సమాధిలో ఉంచబడెననియు, ఆ సమాధి ద్వారమును మూయుటకు ఒక పెద్దరాయి దానిపైకి దొర్లింపబడెననియు, అటు తరువాత రోమాదేశపు గవర్నరుయొక్క ముద్రచే అది భద్రము చేయబడెననియు, దాని చుట్టు రోమాదేశపు కావలివారుంచబడిరనియు వారు అంగీక

రింతురు. 3. అయితే ఈ సంగతులు జరిగిన మూడవ దినము ఉదయమున ఆ సమాధిలోని క్రీస్తు శరీరము మాయమయ్యెననియు, దేవుని యొక్క శక్తివలన క్రీస్తు సజీవుడై తిరిగి లేచినట్లు ఆయన శిష్యులు ప్రగాఢముగ విశ్వసింతురనియు అందరు అంగీకరింతురు.

ఇంతవరకు మనము గమనించిన ఈ విషయములు బైబిలునందు గాక చరిత్రలో కనుగొనబడిన యధార్థములని గ్రహించ వలెను. చరిత్ర దానికదే క్రీస్తు ఈలోకమునకు వచ్చెనని ప్రతి దినము ప్రబోధించుచున్నది. ఇప్పుడు మనము క్రీ. శ. 1983వ సంవత్సరములో యున్నాము. అంటే క్రీస్తు వచ్చినప్పటి నుండి ఇప్పటికి ఒక వెయ్యి తొమ్మిది వందల ఎనుబది మూడు సంవత్సరము లైనదని మనము ఇట్టే గ్రహించగలము. రేనాన్ అను ప్రసిద్ధ నాస్తికుడు క్రీస్తు పునరుత్థానమును తిరస్కరించినను, అతడు వ్రాసిన "క్రీస్తు జీవితము" అనే గ్రంథములో క్రీస్తుయొక్క జీవన్మరణ సమాధులు యధార్థమని అంగీకరించెను. అందువలన మన ప్రస్తుత సమస్య క్రీస్తు శరీరము ఆ సమాధిని వదలగా ఏమాయెను ? అను ప్రశ్నకు సంకుచితమగు చున్నది.

బైబిలు సత్యవేదమని నమ్మువారు యేసే దేవుడు గనుక తనకుగా తాను మరణమును జయించి సజీవుడై తిరిగి లేచెనని నమ్ముదురు. నిర్దేవులు, నాస్తికులు, అవిశ్వాసులు ఆయన పునరుత్థానమును తిరస్కరించి, దానిని గూర్చి అనేక సిద్ధాంతములను కల్పించి చెప్పుదురు. యేసు నిజముగా చనిపోలేదుగాని సిలువపై ఆయన స్పృహకోల్పోయెననియు, సమాధిలో యుంచబడిన కొంతసేపటికి ఆయనకు స్పృహరాగా కావలివారికి కనబడకుండ ఆయన సమాధినుండి దాటుకు పోయెననియు కొందరు వాదింతురు. ఈ ఆరోపణను చేయువారు తమ బుద్ధిని వినియోగించిన యెడల అట్టి ఆరోపణలను చేయరని నా విశ్వాసము. యేసు చనిపోయెనని సైనికులు ప్రకటించిరి ఏలయనగా వారు యేసునొద్దకు వచ్చి, అంతకు ముందే ఆయన మృతి పొంది యుండుట

చూచి ఆయన కాళ్ళు విరుగగొట్టలేదు (యోహాను 19:33). యేసును సిలువ వేసిన ఆ సైనికుల సాక్ష్యమును కోర్టువారు అంగీకరింతురు గాని ఇంచుమించు రెండువేల సంవత్సరముల తరువాత సంశయమును వెల్లడిపరచువారి మాటలనుకాదు. సిలువ వేయబడిన మనుష్యుడు సిలువపై మరణిస్తేనే గాని అతని శరీరమును తీసికొని వెళ్ళుటకు రోమా ప్రభుత్వ చట్టము ఆదేశించదు. అయితే క్రీస్తు సిలువపై చనిపోయిన తరువాతనే ఆయన శరీరము దింపబడెను. యేసు మరణించెనని సైనికులకు నిర్ధారణ యగుటవల్లనే యేసు దేహమును వారు సమాధి చేయుటకు తీసికొనిపోనిచ్చిరి. "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను, వెంటనే రక్తమును, నీళ్ళును కారెను" అని యోహాను 19:34 లో వ్రాయబడి యున్నది. అప్పటికే యేసు చనిపోయి కొన్ని గంటల సమయమై యుండెను. అందువలన ఆయన దేహమునందలి నీరు, రక్తము అప్పటికే వేరుపడెను. మనము గ్రహించవలసిన సంగతి ఇంకొకటి ఏమంటే, అంత క్రూరముగ హింసింపబడి, బంధింపబడి, కొరడాదెబ్బలు కొట్టబడి, శ్రమలుపెట్టబడి సిలువ వేయబడిన తరువాత ఏ మానవమాత్రుడు సమాధిరాయిని తనకు తానే పొర్లించుకొని బయటకువచ్చే శక్తిని మాత్రము కలిగి యుండడు.

## మూడు సందర్భాలు

ప్రస్తుతము మన విచారణ అంతయును సమాధినుండి మాయమయిన క్రీస్తు శరీరముపై కేంద్రీకరించుదము. ఇట్టి విచారణలో ఆ శరీర విషయమై జరుగుటకు అవకాశమున్న మూడు సందర్భములను మనము ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. అవి: (1) క్రీస్తు శత్రువులైన యూదులు ఆయన శరీరమును సమాధినుండి తొలగించి యుండవచ్చును లేదా (2) ఆయన శిష్యులచే అది కొనిపోబడెను లేదా (3) దేవుని శక్తివలన క్రీస్తు మృతులలోనుండి లేచెను.

వచ్చే మూడు సంచికల్లోను ఈ మూడు సందర్భములను విడి విడిగా తీసికొని వాటి నిజానిజాలను దీర్ఘముగ పరిశోధించుదము.

యేసు మృతులలో నుండి తిరిగి లేచుటద్వారా దేవుని కుమారుడుగా మహిమా ప్రభావములతో నిరూపింపబడెనని బైబిలు బోధించుచున్నది. నేను దేవుని కుమారుడనని మీరు విశ్వసింపనియెడల, మీ పాపముల విషయమై మారు మనస్సు పొందనియెడల, నా నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనని యెడల, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందని యెడల మీరు మీ పాపములోనే మరణింతురు అని యేసు చెప్పెను. మిమ్మును రక్షించుటకు క్రీస్తు సంసిద్ధుడై యుండగా మీరు నిత్య నాశనమును ఎందుకు కోరుకొనవలెను ? నిత్య రక్షణలో ప్రవేశించుటకు క్రీస్తు పల్కులకు మీరు ఈనాడే లోబడవలెనని నా ప్రేమపూర్వకమైన హెచ్చరిక !! —జాషువా గూటం.

---

## అధికారయుక్తమైన దైవ వాక్కు - 2

(గత సంచిక తరువాయి)

— టి. జ్ఞానానందము, కాకినాడ.

### దేవుని వాక్యముయొక్క విలువ

బైబిలు గ్రంథముయొక్క విలువ, బైబిలే మనకు చెప్పవలయును. అందుకై కొన్ని వాక్యములు మనము చూడవలయును.

1. వాక్యము కేవలము దైవ ప్రేరితము. "ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలయును. ఏలయన ప్రవచనము ఎప్పుడును మనుష్యుని యిచ్ఛనుబట్టి కలుగలేదు గాని, మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతు 1:20, 21).

2. దేవుని వాక్యము నిర్మలమైనది. "యెహోవా మాటలు

పవిత్రమైనవి. అవి మట్టి మూసలో ఏడు మారులు కరిగి ఊదిన వెండి యంత పవిత్రములు" (కీర్త 12:6). దేవుని వాక్యము కల్తీలేనిది. దేవుని చిత్తమునకు వేరుగా మానవజ్ఞానముగాని, ఊహగాని అందు లేదని దీని భావము.

3. దేవుడు ఒకేసారి తన మాటలు లోకమున కిచ్చినాడు. "పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ..." (యూదా 3 వచ). అనగా దేవుడొకసారి చెప్పిన మాట తిరుగులేనిది. దానికి దిద్దుబాటు గాని, సర్దుబాటుగాని అక్కర లేదు. దేవుడు లోకమున కివ్వవలసిన సత్యము ఒకేసారి యిచ్చి ముగించినపుడు ఈ శతాబ్దములో మరల వేరుగా మరొకటి (అనగా బైబిలులో లేనిది) యిచ్చునా? దేవుడు దర్శనముల ద్వారాను, కలల ద్వారాను క్రొత్త సత్యములను బయలు పరుచుచున్నాడని చెప్పువారి కిదొక భయంకరమైన హెచ్చరిక.

4. మానవునికి క్షేమము కలుగజేయుటకు వాక్యము సరిపోవును. "దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైనది" (2 తిమో 3:17).

వాక్యము చేయు నాల్గు గొప్ప పనులు యిక్కడ చూపబడినవి. ఈ పనులు వాక్యమే చేయగలుగునప్పుడు ప్రత్యేక మతసిద్ధాంతములు తయారు చేసికొన అవసరమే లేదు. మతశాఖల సిద్ధాంతములు భిన్నములై సంఘమును శాఖోపశాఖలుగ విడదీయుచున్నవి.

5. వాక్యముయొక్క స్థానములో మానవ కల్పిత సిద్ధాంతములను పెట్టుట అవివేకము. అది దేవుని చిత్తమునకు కేవలము విరుద్ధము. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగ ఆరాధించుచున్నారు" (మత్త 15:6-9).

పారంపర్యాచారములు (traditions) ఒకే తీరున లేవు. మరియు అట్లుండలేవు. ఈ పారంపర్య బోధలే తప్పుడు సిద్ధాంతముల

ములు, భిన్నమత శాఖలకును కారణములైనవి. ఏలయన అవి వాక్య మును మరుగువరచి ముందుకు చొచ్చుకొని వచ్చి తమ ఆధిపత్యములు చెలాయించుచున్నవి. పారంపర్యాచారములు గలవారు దేవునినే ఆరాధించుచున్నారు, గాని వ్యర్థముగ నారాధించుచున్నారు (మత్త 15:9).

ఈ పారంపర్యాచారములు ఆ దినములలో యేసును బాధించినవి; నేడు సంఘములను బాధించుచున్నవి.

6. వాక్యము సంపూర్ణమైన దైనచో దానిని మార్చుట కెవరికిని అధికారము లేదు, "వాటిని గైకొనుటయందు నేను మీ కాజ్ఞాపించిన మాటతో దేనిని కలుపకూడదు. దానిలో నుండి దేనిని తీసివేయకూడదు" (ద్వితి 4 : 2). ఈ మాటలు అందరును - నమ్ముచున్నాము అనుచునే క్రొత్తది కలుపుచునే యున్నారు. ఉన్నదానిని తీసివేయుచునే యున్నారు. అందులకే సంఘము లన్నిటిలో ఒకే విశ్వాసము లేదు, ఒకే బాప్తిస్మము లేదు (ఎఫె. 4:5). మరియొకసారి సంఘము లీదినములలో ఈ భయంకరమైన హెచ్చరికను గమనించాలి.

## పాత, క్రొత్త నిబంధనలకు గల సంబంధమును తేడాయును

బైబిలంతయు దైవ ప్రేరితమే. ఆదికాండము ప్రారంభము నుండి ప్రకటన గ్రంథము యొక్క అంతమువరకును గలది దేవునివాక్యమని నమ్మవలయును. ప్రభువైన యేసు బైబిలంతటికిని కేంద్రమై యున్నాడు. ఆయన పాత, క్రొత్త నిబంధనల మధ్య నిలువబడి లేఖనముల నెత్తి తానెవరో తెలియజేయుటలో పాత నిబంధన యంతయు సత్యమని ముద్ర వేయుచున్నాడు. మరియు చేపకడుపులో యోనా ఉండుటకూడ సత్యమే అనునంతవరకు యేసుప్రభు పాత నిబంధనను నమ్మినాడు. మనమును అట్లే నమ్మవలయును. మరియు క్రొత్త నిబంధన మీదికి తన వెలుగును ప్రసరింప జేయుటద్వారా దానికంతటికి తానే ఆధారభూతుడనని ఎలుగెత్తి చాటుచున్నాడు. మరియు "లేఖన

ములు నన్ను గూర్చి సాక్ష్య మిచ్చుచున్నవి" (యోహా 5:39) "మోషే ధర్మ శాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరినవి" (లూకా 24 : 44) అని యేసుప్రభువు చెప్పినపుడు పాత నిబంధన యెంత యథార్థమైనదో, ఎంత సత్యమైనదో ఆయన తెలియజేయుచున్నాడు.

క్రొత్త నిబంధన పాత నిబంధనలో దాచబడినదనియు, పాత నిబంధనను, క్రొత్త నిబంధన బయలుపరచినదనియు సామాన్యముగ చెప్పుదుము.

అయినను ఈ రెంటికినిగల గొప్ప భేదమును మనము గుర్తెరుగవలయును. పాత, క్రొత్త అను పేరులు పెట్టుటలోనే భేద మున్నట్టు గ్రహించగలము.

| పాత నిబంధన : | క్రొత్త నిబంధన : |
|---|---|
| 1. మోషే ద్వారా కలిగెను (యోహా 1:17, అ.కా. 7:38). | 1. క్రీస్తుద్వారా కలిగెను (హెబ్రీ 8:6; 12:24). |
| 2. రాతి పలకపై వ్రాయబడెను- (2 కొరి 3:7). | 2. హృదయములపై వ్రాయబడెను (2 కొరి 3:3, హెబ్రీ 8 : 10). |
| 3. యూదులకు యివ్వబడెను (రోమా 2 : 14, 17, 3 : 1, 9 : 1-5). | 3. మానవులందరికిని యివ్వబడెను (మత్త 23 : 18-20, మార్కు 16 : 15). |
| 4. జంతువులరక్తముచే ప్రతిష్ఠించబడినది (హెబ్రీ 9:18-22). | 4. క్రీస్తు రక్తముచే ప్రతిష్ఠింపబడినది (మత్త 2:28, 1 కొరి 11 : 25). |
| 5. లోపసహితమైనది (హెబ్రీ 8 : 7). | 5. సంపూర్ణత నిచ్చునది గనుక లోపములేనిది. (హె. 7:25). |
| 6. అక్షరము - చంపును (2 కొరి 3 : 6). | 6. ఆత్మ-జీవింపజేయును (2 కొరి. 3 : 6). |

**పాత నిబంధన :**

7. మరణ కారణమగు పరిచర్య (2 కొరి 3:7).
8. శిక్షావిధికి కారణమైన పరిచర్య (2 కొరి 3:9).
9. మహిమగలది (2 కొరి 3:7-11)
10. పాప క్షమాపణ కలుగజేయలేదు (హెబ్రీ 10 : 1-4, 7 : 18-19).
11. ప్రధానయాజకుడు బలహీనతలతో నిండినవాడు- (హెబ్రీ 7 : 28).
12. మార్పుగలిగిన యాజకత్వము (హెబ్రీ 7:12).
13. లేవీయులు మాత్రమే యాజకులుగ ఉండనర్హులు (హెబ్రీ 7:12-14).
14. సంతానము వచ్చువరకు ఇవ్వబడినది (గల. 3:19).
15. క్రీస్తునొద్దకు మనలనుకొనిపోవు బాలశిక్షకుడు (గల. 3 : 24).
16. దాసికిని, దాని కుమారునికిని పోలిక గలది (గల. 4:21-25).
17. క్రీస్తునందు కొట్టివేయబడినది (2 కొరి. 3:11-14, హెబ్రీ 10 : 9, 10 ఎఫె 2 : 14, 15, కొలొ 1:34-17).

**క్రొత్త నిబంధన :**

7. ఆత్మ సంబంధమైన పరిచర్య (2 కొరి. 3:3).
8. నీతికి కారణమైన పరిచర్య (2 కొరి. 3:9).
9. అధికమైన మహిమగలది (2 కొరి. 3:8-10).
10. పాపములు, అక్రమములు జ్ఞాపకమునకు తేబడవు (హెబ్రీ 10:16-18).
11. పవిత్రుడును, నిర్దోషి యైనవాడునగు ప్రధాన యాజకుడు హెబ్రీ 7-26).
12. మార్పు లేని యాజకత్వము (హెబ్రీ 7:24).
13. క్రైస్తవులందరును యాజకులే (1 పే. 2:5, 9, ప్రక. 5:10).
14. ఆ సంతానమైన క్రీస్తువచ్చెను (గల. 3:16).
15. బాల శిక్షకుని క్రింద యిక ఉండము (గల. 3:25).
16. దాసియు, దాని కుమారుడును వెళ్ళగొట్టబడవలసి యున్నారు (గల. 4:30, 31).
17. నిలిచియున్నది (2 కొరి. 3:11, మత్త 24 : 35, 1 పేతు. 1 : 23 : 24).

| పాత నిబంధన : | క్రొత్త నిబంధన : |
| --- | --- |
| 18. క్రీస్తుయొక్క ఛాయమాత్రమే (కొలొ 2 : 17 హెబ్రీ 10 : 1). | 18. క్రీస్తుయొక్క నిజ స్వరూపము (కొలొ. 2 : 17). |

## గమనించుము

పాత నిబంధన క్రీస్తులో కొట్టివేయ బడినదని మనము చెప్పునపుడు గ్రంథములో గల గొప్ప చరిత్రయు ప్రవక్తల అమూల్యమైన బోధలును కొట్టివేయబడినవని మనము తలంచరాదు. యేసుప్రభు నిబంధనను కొట్టివేసెను గాని గ్రంథములోని బోధలను కాదు.

దేవుని మాటలన్నియు, విధులన్నియు మేము గైకొందుమని ఇశ్రాయేలీయులు రక్తముద్వారా దేవునితో నిబంధన చేసికొనిరి (నిర్గమ 24:3, 7, 8) కాని ఆ నిబంధనలో వారు నిలువలేకపోయిరని తరువాత చరిత్రయే రుజువుచేసినది. కనుక వారు శాపగ్రస్తులైరి (గల 3:10, 11). ఆశాపమునుండి మనను విడుదల చేయవలెనన్న ఆ నిబంధనను రద్దుచేయవలయును. యేసు మనమీద రుణముగాను, మనకు విరోధముగాను, మనకు అడ్డముగాను ఉన్న పత్రమును (పాతనిబంధనను) సిలువకు కొట్టివేసెను (కొలొ 2:13-15).

అది ఛాయ మాత్రమే. గతించిపోయినది నిజ స్వరూపము క్రీస్తులో నున్నది (హెబ్రీ 10:1-4).

రక్షణకు నూతన నిబంధన మాత్రము మన కవసరమైనను పాత నిబంధన గ్రంథముతో మన కెల్లప్పుడు సంబంధమున్నది.

1. క్రొత్త నిబంధనలోని సంగతులు మనకు బోధపడవలెనన్న మనకు పాత నిబంధన తెలిసియుండవలయును.

2. క్రీస్తు పాత నిబంధనలో దాచబడియున్నాడు అని సామాన్యముగ చెప్పుదుము. ఆయనలో మనము పొందిన రక్షణయొక్క

మహిమ సంకల్పమును గ్రహించవలెనన్న పాత నిబంధనను ఎరిగి యుండవలయును.

3. మన జీవితమునకు జాగ్రత్తాసూచన నివ్వగల విషయములు పాత నిబంధన కాలములో సంభవించి ఈ దినములలో మనకు బుద్ధి కలుగుటకై అవి అందు వ్రాయబడినవి (1 కొరిం. 10 : 11, రోమా 15 : 14). ఈ కారణములను బట్టి మనము పాత నిబంధన చదువవలయును. (సశేషము)

## కేవలం నీట మునిగిన మాత్రము చాలదు

*(Just an immersion is not enough)*

—సన్నీ డేవిడ్, న్యూఢిల్లీ.

బాప్తిస్మము అనగా నీటిలో మునుగుట లేక నీటిలో పాతిపెట్టబడుట అని బైబిలు బోధించుచున్నది. రోమీయులకు వ్రాసిన పత్రిక 6:3-4 లో రచయిత "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు, మనమును బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతోకూడా పాతిపెట్టబడితిమి" అని వ్రాసెను. కొలస్సయులకు వ్రాసిన పత్రిక 2:12 లో "మీరు బాప్తిస్మమందు ఆయనతోకూడా పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుటద్వారా ఆయనతో కూడా లేచితిరి" అని బాప్తిస్మమును గూర్చి వివరించియున్నాడు. ఫిలిప్పు నపుంసకునికి క్రీస్తునుగూర్చి ప్రకటించినప్పుడు రికార్డు యీ విధముగా వున్నది. "వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు ఇదిగో నీళ్ళు, నాకు బాప్తిస్మ మిచ్చుటకు ఆటంక మేమని

అడిగినప్పుడు, ఫిలిప్పు - నీ పూర్ణ హృదయముతో నమ్మినయెడల బాప్తిస్మము తీసికొనవచ్చును అని చెప్పెను - అప్పుడు నపుంసకుడు యేసుక్రీస్తు సజీవుడైన దేవుని కుమారుడని నమ్ముచున్నాను అని చెప్పి రథమును నిలుపుమని ఆజ్ఞాపించెను- ఫిలిప్పు, నపుంసకుడు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను" (King Jame's Version అపో. 8:36-38).

ఏది ఏమైనప్పటికిని బైబిలు బాప్తిస్మము ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యమును చాటుచు యేసుక్రీస్తు సువార్తలో ఒక భాగమై యున్నది. అందువలన ఫిలిప్పు, నపుంసకునికి క్రీస్తును గురించి బోధించినప్పుడు నపుంసకుడు వెంటనే బాప్తిస్మము తీసికొనుటకు కోరియున్నాడు. అదే విధముగా ఫిలిప్పి అను పట్టణములో పౌలు, సీలలు చెరసాల నాయకునికిని, తన యింటివారికిని దేవుని వాక్యమును బోధించినప్పుడు - వారు రాత్రి గడియలోనే బాప్తిస్మము పొందిరి. ఎందుకు? ఎందుకనగా బైబిలు ప్రకారము పాపక్షమాపణ నిమిత్తము మారు మనస్సు పొంది ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని పేతురు అ.పొ. 2:38 లో బోధించెను. బాప్తిస్మము మన పాపములను కడిగివేయును (అ.పొ. 22:16). క్రీస్తులోనికి బాప్తిస్మము తీసికొని ఒకడు క్రీస్తును ధరించును, ఆయన సంఘ సభ్యుడగును (గలతి 3 : 27). ఆయనలోనే పాపము నుండి మోక్షమునకు మార్గము గలదు. (I కొరింథి 12:13).

ఈరోజులలో అనేకమంది క్రొత్త నిబంధన బోధించు విధమున బాప్తిస్మము పొందక కేవలం నీటిలో మునుగుదురు. ఏలననగా వారు బాప్తిస్మము యొక్క ఉద్దేశ్యమును గుర్తించి తమ పాప క్షమాపణ నిమిత్తము వాక్యము బోధించు విధమున బాప్తిస్మము పొందరు. అనేక మతబోధకులు మతశాఖలు (సంఘములు) "బాప్తిస్మము వలన మనము రక్షింపబడుదుము" (I పేతురు 3-21). "మీరు మారు

మనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అ.పొ. 2:38) అని చెప్పు పేతురు బోధలను పాటించక మానవులు కల్పించిన పద్ధతులను అనుసరించుదురు. నేటి విశాల ప్రపంచము ఒప్పుకొనిన, నేర్చుకొనిన నమ్ముచున్న సిద్ధాంతమేమనగా యేసుక్రీస్తును తన స్వరక్షకునిగా అంగీకరించి, తన పాపములను ఒప్పుకొనిన ఒకడు "రక్షింపబడగలడను" నదియే. కొంతకాలము తర్వాత "ఆ రక్షింపబడిన ఒకడు" తాను క్రీస్తును అనుసరించు చున్నాడనియు లేక క్రైస్తవుడనని చూపుటకొరకు మాత్రము బాప్తిస్మమను పద్ధతిని అనుసరించుచున్నారు. కొన్ని వేలమంది ప్రజలు యిప్పటికి ఈ పద్ధతిని అనుసరించి యున్నారు. కాని వారు అనుసరించిన మార్గము సరియైనది కాదు. ఏలయనగా వారు వాక్యము బోధించు విధమున తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందియుండలేదు. నీ పాపములు క్షమించబడినవి అని చెప్పిన అబద్ధబోధకులను విని ఒకడు రక్షింపబడినట్లు అర్ధము చేసికొని యున్నాడు. కాని సత్యవాక్యము బోధించువిధమున వారు బాప్తిస్మము పొంది యుండలేదు. నీకు బైబిలును గూర్చి బాగా తెలిసిన యెడల ఒకడు రక్షింపబడుటకు యేసుక్రీస్తు పెట్టిన సరియైన క్రమమిది: (1) నమ్మిక (2) బాప్తిస్మము (3) రక్షణ. అట్లైన ఈ క్రమములో రక్షణ అనునది బాప్తిస్మమునకు పూర్వమా? లేక తర్వాతనా? ఒకసారి యేసుక్రీస్తు స్వయంగా చెప్పిన మాటలను గమనించుదము. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16). ఆలాగుననే అపొస్తలుడైన పేతురుకూడా మనము పైన చదివిన విధమున ఒకడు మారుమనస్సు పొంది తన పాపక్షమాపణ "నిమిత్తము" అని చెప్పెను (అపొ. కా. 2:38). కాబట్టి సౌలు నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము

పొంది నీ పాపములను కడిగివేసికొనుమని బోధింపబడెను (అపొ. కా. 22 : 16).

పైన చెప్పిన క్రమము ప్రకారము నీవేమి గ్రహించితివి? ఈ వ్యాసము చక్కగాచదివి సత్యమును అర్థముచేసికొనిన వారు బాప్తిస్మము యొక్క ముఖ్యోద్దేశ్యమును గ్రహించి ఒకనిర్ణయమునకు వచ్చియుందురని నా ఉద్దేశ్యము. అవునా? మీరు ఆ నిర్ణయమును నిశ్చయముగా చేపట్టియున్నారా? మీకు బాప్తిస్మము యిచ్చిన బోధకుడు పాపక్షమాపణ నిమిత్తము మీరు బాప్తిస్మము పొందవలెనని బోధించి యున్నాడా? రక్షణ పొందుటకు ఒకడు బాప్తిస్మము పొందుట అవసరమని మీకు బోధించి యున్నాడా? నిశ్చయముగా మీకు అలా బోధించి యుండి యుండడు. ఏలయనగా రక్షింపబడుటకు బాప్తిస్మము అవసరము అని కొందరు బోధకులు విశ్వసించరు గనుక అలాంటి బోధకులకు బాప్తిస్మము అనునది విశ్వాసమునకు ఒక చిహ్నము మాత్రమే. ముందుగనే రక్షింపబడి యున్నానని తలంచి, తర్వాత బాప్తిస్మము పొందిన యెడల అది సరియైన క్రమముకాదు. నీవు అలాంటి బాప్తిస్మమును పొంది ఒక వారము కావచ్చును లేక ముప్పై సం॥ కావచ్చును. కేవలం నీటమునిగిన సరిపోదు. పాపక్షమాపణ నిమిత్తమును రక్షింపబడుటకును, క్రీస్తును ధరించి ఆయన (శరీరములో ఒక అవయవముగా) సంఘసభ్యునిగా, నమ్మి బాప్తిస్మము పొందిన యెడల రక్షింపబడుదువు. రక్షణ పొందినవారిని ఆయన తన సంఘముతో చేర్చుకొనును (అపొ. కా. 2:47).

అనువాదం : రవీంద్రన్ బాబు.

# అమ్మబడు క్రైస్తవులు

"అయినను నే నిక్కడికి వచ్చునట్లు మీరు నన్ను అమ్మివేసి నందుకు దుఃఖపడకుడి. అది మీకు సంతాపము పుట్టింపనియ్యకుడి. ప్రాణ రక్షణకొరకు దేవుడు మీకు ముందుగా నన్ను పంపించెను" అని యోసేపు పలికెను (ఆది 45:5).

యోసేపు తన సహోదరుల ద్వేష స్వభావమువలన ఐగుప్త వర్తకులకు అమ్మబడ్డాడు. అతడు యేసుక్రీస్తుకు సాదృశ్యముగా యున్నాడు. యేసుక్రీస్తు తన శిష్యుడైన ఇస్కరియోతు యూదావలన అమ్మబడ్డాడు. ఏశావు ఒక్కపూట భోజనానికి తన జ్యేష్టత్వమును యాకోబుకు అమ్ముకున్నాడు.

క్రైస్తవులను పదము మొట్టమొదట అంతియొకయలో క్రీస్తు శిష్యులకు కలిగిన పవిత్రనామము (అపొ.కా. 12:26). అట్టి నామమును బట్టి పిలువబడుచున్న 'క్రైస్తవులు' కొందరు ఈనాడు ఆయా కారణాలనుబట్టి మతశాఖల తత్వానికి, మానవకల్పిత సిద్ధాంతాలకు లోనై అమ్ముడగుచున్నారు.

క్రీస్తు బోధయందు నిలిచియుండనివాడు, వేరొక బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరింపనివాడు (2 యోహాను :9). మీ ప్రాణరక్షణ నిమిత్తము దేవుడు నన్ను ముందుగా ఇక్కడకు పంపించెనని యోసేపు తన సహోదరులకు చెప్పాడు. కరువు కాలంలో వారిని రక్షించాడు. యేసుక్రీస్తు నశించిన దానిని వెదకి రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడు. ఘోరహింసలను, బాధలను పొంది సిలువను సహించి మనకు రక్షణ బాటను యేర్పరచాడు. గుడులు గోపురాలు కట్టించుట వలనగాక, తీర్థయాత్రలు పుణ్యక్షేత్రాలు దర్శించుటవలనగాక యేసుప్రభువును నమ్మి బాప్తిస్మము పొందుటవలన ఆయన నామాన్ని నీవు ధరించుకోగలవు. ఒకడు సిలువను కంఠహారముగా ధరించినంత మాత్రమున క్రైస్తవుడైపోడు.

నీవు మతశాఖల బోధలకు అమ్ముడై పోనవసరం లేదు. దేవుని వాక్య సహాయంవలన అసత్యారాధికులను సత్యారాధికులుగా మార్చ వచ్చు. యేసుక్రీస్తు మన ఆత్మల రక్షణార్థం అమ్మబడ్డాడు. ఆయన తన స్వరక్త మిచ్చుటద్వారా నిన్ను నన్ను కొన్నాడు. ఆయన స్థాపించిన సత్య సంఘ సభ్యులై ప్రభుని ఆత్మతోను సత్యముతోను మీరారాధింతురని నా విశ్వాసము.

—A. ఇశ్రాయేలురాజు, కాకినాడ.

———

## లంచం

—J.C. ఛోట్

ప్రతి సగటు మనిషి లంచం అనే జాడ్యంవలన బాధింపబడుతున్నాడు. ఉద్యోగంకోసం లంచం, పోలీసుల నుండి రక్షణకొరకు లంచం, అధిక సంపాదనకొరకు లంచం; కోటాలు, రేషన్లు, పర్మిట్ల కొరకు లంచం. అన్నివిధాల అన్నిదశల్లోను లంచం వ్యాపించిపోయింది. లంచం అనేది ఒక సామాన్య విషయంగా, మామూలు అన్నట్లుగా మారిపోయింది. ఎక్కువమంది ఇది బ్రతకడానికొక మార్గంగాను బ్రతుకు తెరువుగాను భావిస్తున్నారు. ఇలాంటిస్థితిలో ఒక క్రైస్తవుడు ఈ లంచాల ప్రపంచంలో ఎలా గడపాలి ?

1) లంచం తీసుకొని న్యాయాన్ని తలక్రిందులు చేయరాదు (సామె 17:23).

2) లంచం తీసుకొని కళ్ళకు గుడ్డితనం కలుగ జేసుకోరాదు (నిర్గమ 23:8).

3) లంచగొండుల నివాసాలు కాలిపోతాయి(యోబు 15:34).

4) పాపులు, రక్తదాహంగల దుష్టుల చేతులు ఎప్పుడూ లంచాలతో నిండి ఉంటాయి. వారిని దేవుడు నరకంలోకి ఊడ్చి వేస్తాడు (కీర్త 26:9).

5) నీతిగా బ్రతుకుతూ, సత్యమే పలుకుతూ దోపిడి సంపాన

సను ద్వేషిస్తూ లంచం అంటే వణుకుతూ రక్తపాతం అంటే చెవులు మూసుకుంటూ దుష్టత్వం అంటే కళ్ళు మూసుకుంటూ ఉండేవాడు ఉన్నతస్థలాలలో నివసిస్తాడు. రాతి గుహలాంటి రక్షణ వాడికి దొరుకుతుంది. అతని ఆహారం అతనికి దొరుకుతుంది. వాడు తాగే నీరు చాలా మంచిది (యెషయా 33:15).

7) లంచగొండులు నీతిమంతులను బాధిస్తారు. ద్వారందగ్గర కొచ్చిన బీదలను తరిమివేస్తారు (ఆమోసు 5:11). మంచివాడు లంచం తీసుకోడు. అది చెడుసమయం.

8) లంచం తీసుకొని తప్పుడుసాక్ష్యం పలుకరాదు.

9) ఇతరుల సొమ్ము ఆశించకపోతే వారికి బుద్ధి చెప్పవచ్చు.

10) సంతోషంగా ఇచ్చేవాడిని దేవుడు ఎంతో ప్రేమిస్తాడు. ఇవ్వటం అనేది దేవుని దృష్టిలో నేగాక మానవుల దృష్టిలోకూడా గౌరవనీయమైనదే. పుచ్చుకోటంకంటే ఇవ్వటం మంచిది. తనదికాని వస్తువును, అన్యాయంగా తీసుకోవటం లంచం. ఉదారబుద్ధి కలిగి దాతృత్వగుణం కలిగినవాడు ఎప్పుడూ ఇస్తూనే ఉంటాడు. అయితే లంచంగా మాత్రం ఇవ్వడు. తీసుకోడు (2 కొరింథీ 9:7; అపొ. కా. 20 : 35).

11) సత్యానికి విరుద్ధమైనపని ఏదీ చేయరాదు. సత్యంకోసమే ఏపనినైనా చేయాలి.

12) లంచానికి లంచం ప్రతీకారంగా తీసుకోరాదు.

13) అన్నింటిలోనూ గౌరవంగా బ్రతకటానికి మనకు ఒక శుద్ధమైన అంతరాత్మ ఉన్నది (2 తిమో 1:7).

14) అన్యులందరిలోనూ మంచి ప్రవర్తన కలవారై యుండుడి. మీరు చెడ్డవారని ఇంతకాలం చెప్పినవారు మీ సత్క్రియలను చూచి దేవుణ్ణి మహిమపరచేలాగా మంచి పనులనే చేయండి (1 పేతురు 3:16; మత్త 5:16).

అనువాదం : N. రహంతుల్లా, చీమకుర్తి.

## భయము

లోకమంతా భయంతో నిండివుంది. మరణమంటే భయం, చీకటంటే భయం, క్రిమికీటకాలంటే భయం, తుఫానంటే భయము, దయ్యం అంటే భయం. ఈవిధమైన భయాలు నేటి మానవుని పీడిస్తున్నాయి. వార్తాపత్రికలు, రేడియోలు ప్రతిరోజు భయాన్ని జ్ఞప్తికి తెచ్చి వేధిస్తున్నాయి.

## మానవుని భయము

ప్రభువీ లోకములో ఉన్నప్పుడు అధికారులలో కూడ అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి గాని సమాజములో నుండి వెలివేయబడుదువేమో యని పరిసయ్యులకు భయపడిరి (యోహాను 12:42). అయితే దీనినిగూర్చి బైబిలులో ఈలాగున యున్నది:

మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమునుకూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి అని దేవుడు హెచ్చరించుచున్నాడు (మత్తయి 10 : 23).

క్రీస్తు జన్మించిన తరువాత కొందరు గొఱ్ఱెల కాపరులు పొలములో ఉండి రాత్రి వేళ తమ మందను కాచుకొనుచుండగా ప్రభువు దూత వారియొద్దకు వచ్చి నిలిచెను; ప్రభువు మహిమ వారి చుట్టూ ప్రకాశించినందున, వారు మిక్కిలి భయపడిరి (లూకా 2:8-9).

క్రీస్తు సమాధికి కావలి యున్నవారు భయపడిరి. శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలి యున్నవారును, భూకంపమును, జరిగిన కార్యములన్నిటిని చూచి మిక్కిలి భయపడిరి (మత్తయి 27:54)

సాతాను మనలను పాపము చేయుటకు ప్రోత్సహించును గనుక మనము సాతానుకు భయపడి అతని క్రియలకు దూరముగా ఉండాలి (I పేతురు 2:1-3; 1:17; 2:11).

## మనము ఎవరికి భయపడాలి ?

మనము దేవునికే భయపడవలెను. ఆయన యిట్లు చెప్పెను: నేనే ఆయనని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు (యోహాను 8:24).

మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును అలాగే నశింతురు (లూకా 13:5).

ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడునని యెహోవా ఆజ్ఞ యిచ్చెను (ప్రకటన 20:15). ఆ భయంకర నిత్య నరకాగ్ని నుండి తప్పించుకొనవలెనంటే నేడే ప్రభువైన యేసునందు విశ్వాసముంచి "మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపో.కా. 2:38).

ఆయన సత్యసంఘమందు సభ్యులగుము. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16).

— పి. చంద్రశేఖర్.

## బైబిలు చదువుటకు టైమ్ లేదా ?

దేవుని వాక్యాన్ని చదవడం లేక వినడంద్వారా. విశ్వాసము కలుగుతాది (యోహాను 20:30, 31; రోమా 10:17). కాని దేవుని గ్రంథాన్ని చదవడానికి చాలమందికి టైమ్ దొరుకుటలేనట్లుగు పడుచున్నది. అయితే బైబిలును ప్రతిరోజు చదవడానికి మీకు సమయం ...ంచే కొన్ని సలహాలు ఈదిగువ పొందు పర్చబడ్డాయి. వాటి ననుసరిస్తే మీకు సహాయం దొరికవచ్చు.

1. మీరెక్కడికి వెళ్ళినా మీతో కూడా బైబిలును తీసికొని వెళ్ళండి. సమయం చిక్కిన వెంటనే చదవండి.

2. మీ మంచం దగ్గరగాని, తలగడ (గలీబు) క్రిందగాని బైబిలు నుంచుకొనండి. మీకు నిద్రరాకపోతే లైటు వెలిగించి దేవుని గ్రంథాన్ని కొంతసేపు చదువుకోవచ్చు.

3. ఏదైనా మీటింగుకు వెళ్ళేటప్పుడుగాని, ఎవరికొరకైనా

కనిపెట్టేటప్పుడుగాని బైబిలును మీదగ్గర ఉంచుకోనండి. మీటింగు ఆలస్యంగా మొదలుపెట్టినా, మీదగ్గరకు రావలసినవారు ఆలస్యంగా వచ్చినా ఆ సమయంలో మీరు బైబిలును చదువుకోవచ్చు.

4. బైబిలు లేకుండా బస్సులోగాని, రైలులోగాని, విమానంలోగాని ఎప్పుడు ప్రయాణించవద్దు. మీరు ప్రయాణించే సమయం అంతా అటు యిటూ చూస్తు యుండేకన్నా దేవుని గ్రంథాన్ని చదువుచూ యుండడం మేలుకాదా.

5. ఏదైనా ఆఫీసుకో లేక డాక్టరు దగ్గరకో వెళ్ళినప్పుడు అక్కడ ఉంచబడిన వివిధ పత్రికలు చదువుటకు బదులు దేవుని వాక్యాన్ని చదువుకొనేలాగున బైబిలును తీసుకెళ్ళండి.

6. వాక్యాన్ని చదవడం అనేది. దేవుని ఆజ్ఞయని ఎన్నడు మరచిపోకండి!! (కొలస్స 4:16). సమయం ప్రశస్తమైనది. దాన్ని పాడుచేయొద్దు. దేవుని వాక్యాన్ని రోజూ చదువుకొనే మార్గాన్ని తెలిసికొనండి. దాన్ని చదవడానికి మన ఆసక్తి బలమైనదయితే తగిన సమయం ఎల్లప్పుడు ఉంటాది!! ★

---

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To
..............................
..............................
..............................
..............................